శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించుకున్న ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర - నరసన్నపేట : సాలిహుండం కాళీయ మర్ధన శ్రీ వేణుగోపాల స్వామివారిని బుధవారం వైసీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కృష్ణదాస్‌కు ఆలయ మర్యాదలతో, మంగళ వాయిద్యాలతో ఆలయంలోకి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, స్వామివారి తీర్థ, ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, ఆరంగి మురళీధర్, వైసిపి నాయకులు, చింతు రామారావు, రాజాపు అప్పన్న, బగ్గు రమణయ్య, బొబ్బాది ఈశ్వరరావు, తోట భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఐదు లక్షల మందిలో ఒకరికి జిబిఎస్ వ్యాధి వస్తుంది

విశాలాంధ్ర - సంతబొమ్మాలి : ప్రతి ఐదు లక్షల మందిలో ఒకరికి జిబిఎస్ వ్యాధి వస్తుందని డిఎంఎంహెచ్ఓ బాల మురళీకృష్ణ అన్నారు. సంతబొమ్మాలి మండలము కాపు గోదాయవలస గ్రామాన్ని బుధవారం ఎంఆర్‌హెచ్ఎం బృందంతో పాటు ఆయన వచ్చి, జిపిఎస్ వ్యాధితో బ్రెయిన్ డెడ్ అయి చనిపోయిన వాతాపి యువంత్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొదట వ్యాధి లక్షణాలు ఏ విధంగా ఉన్నది, ఎక్కడ ట్రీట్మెంట్ తీసుకున్నారు అన్న విషయాన్ని మృతుడు తల్లిదండ్రులు చిరంజీవి, రోజాకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గొంతు నొప్పి, జ్వరం ఉన్న ఆరుగురు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డిఎం అండ్ హెచ్ ఓ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ, వివిధ ఆసుపత్రులు ఇచ్చిన డాక్యు మెంట్లో పరిశీలించామని ఒకరు మాత్రం జిపిఎస్ వ్యాధిగా గుర్తించారని మిగిలిన వారు కన్ఫర్మ్ చేయలేదని అన్నారు. ఒకవేళ జిపిఎస్ వ్యాధి అయి ఉంటే ఇది చాలా రేర్ కేసు అని అన్నారు. ఇలాంటి కేసు మన రాష్ట్రంలో ఎక్కడా లేదని మహారాష్ట్ర, తెలంగాణ లో నమోదు అయిందని అన్నారు. జిపిఎస్ వ్యాధి అయి ఉంటే ఇంత త్వరగా మృతి చెందడం విచారకరమని అన్నారు. పుట్టెడు దుఃఖంలో కూడా తల్లిదండ్రులు అవయవ దానానికి ముందుకు రావడం పలువురికి ప్రాణదాతలు కావడం మంచి నిర్ణయమని తెలిపారు. గ్రామంలో నీటి సామర్థ్య పరీక్షలు నిర్వహించి, మెడికల్

క్యాంపులో ఏర్పాటు చేసి ఇంటింటా సర్వే చేయాలని వైద్య సిబ్బందికి డిఎం అండ్ హెచ్ ఓ ఆదేశించారు. అంతకుముందు స్థానిక సర్పంచ్ అంగ లక్ష్మి, జనార్ధన్, మల్లేష్ మాట్లాడుతూ గ్రామానికి 104 సేవలు అందించాలని, 108 వాహనం కాల్ చేసినా రావడంలేదని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. 104,108 సేవలు మీ గ్రామంలో అందుబాటులో ఉంటాయని డిఎంఅండ్ హెచ్ఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ మేరీ కేథరిన్, డిపిఎమ్ఓ వాన సురేష్ కుమార్, దండు గోపాలపురం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ సుధీర్ స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు ఉన్నారు.

ఘంటసాల ది గ్రేట్‌ను ఆదరించండి... ఆశీర్వదించండి

- ఒక టిక్కెట్‌పై ఇద్దరు చూసేందుకు అవకాశం

- చిత్ర నిర్మాత, డైరక్టర్ సీహెచ్ రామారావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : తెలుగు పాట ఉన్నం త కాలం ఘంటసాల వెంకటేశ్వరరావు సజీవంగా ఉంటారని, ఆయన కీర్తి, ఖ్యాతి అజరామరమని పేర్కొన్నారు. నగరంలోని 80 ఫీట్ రోడ్డులో ఉన్న వీ-1 రెస్టారెంట్‌లో ఘంటసాల ది గ్రేట్ చిత్ర నిర్మాత, దర్శకుడు సీహెచ్ రామారావు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఘంటసాల గాయకుడిగానే కాకుండా వ్యక్తిత్వం కూడా ఎంతో ఉన్నతమైనదని కొనియాడారు. తెలుగు మాటను, తెలుగు పాటను తనదైన స్వరంతో అలరించిన మహానుభావుడు ఘంటసాల అని కొనియాడారు. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా, తెలుగువారి పెదాలపై నాట్యం చేసేది ఘంటసాల పాటలేనని వివరించారు. భువిపై గానగంధర్వుడి గానం వినే అదృష్టం మనకు మాత్రమే దక్కిందని సగర్వంగా చెప్పుకోవచ్చునని తెలిపారు. తెలుగు పాట అంతరించిపోతున్న సమయంలో పాటకు జన్మనిచ్చి, పెంచి, పోషించారని కొనియాడారు. రాష్ట్రంలో ఏ గాయకునిపైన పూర్తి స్థాయి నిడివి చిత్రం నిర్మించలేదని ఆ అవకాశం మాకే దక్కిందన్నారు. ఈ చిత్రంలో గాయకుడు కృష్ణచైతన్య, యాంకర్ మృదుల నటన ఎంతోగానో ప్రేక్షకులకు ఆకట్టుకుంటుందన్నారు. వారితో పాటు సుమన్, భార్గవి, సాయికిరణ్ వంటి వారు నటించారని రామారావు వివరించారు. ఈ నెల

14న ప్రేమికుల రోజున మారుతీ థియేటర్‌లో విడుదల చేయనున్నామని ఒక టికెట్‌పై ఇద్దరు చూసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఘంటసాల అభిమానులు, ఆరాధికులు, ప్రజలు సినిమాను ఆదరించి, ఆశీర్వదించాలని కోరారు. తొలుత శ్రీకాకుళంలో సినిమాను విడుదల చేసిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా జైత్రయాత్ర సాగుతుందన్నారు. ఘంటసాల గాయకులుగానే కాకుండా సుమారు 100 చిత్రాలకు సంగీత దర్శకులుగా పనిచేయాలని చెప్పారు. సినిమా నిర్మాణానికి ప్రోత్సహించిన పీవీఎస్ రామ్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రముఖ వ్యాపారవేత్త నటుకుల మోహన్, చక్రవర్తి, గాయకులు బగాది కూర్మారావు, ఈవెంట్ మేనేజర్ సాయిబాబు, మార్గదర్శి శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పలాస విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర - పలాస : పలాస విద్యావాహిని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రణీత్ జాతీయ స్థాయిలో జరిగిన టెన్నికాయిట్ పోటీలలో తన ప్రతిభను కనభరిచారు. ఇటీవల తమిళనాడు రాష్ట్రం చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి టెన్నికాయిట్ ఆటల పోటీలలో కొవ్వూరు ప్రవీణ్ కుమార్ వ్యక్తిగత విభాగంలో నాల్గవ స్థానంఓ నిలిచి ప్రతిభకనభరిచారు. విద్యార్థి ప్రవీణ్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, ఆయుధం గిరి, పైల తిరుపతి రావు అధ్యాపకులు, ప్రవీణ్ ను అభినందించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర - ఆమదాలవలస : నిరుద్యోగ యువత కు ఔత్సాహిక పారిశ్రామిక శిక్షణా కార్యక్రమం స్థానిక ఆమదాలవలస లో గల టిఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఫిబ్రవరి 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు అందించ ను న్నట్లు టి ఎస్ ఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ భాస్కర రావు ఒక ప్రకటనలో ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువకు లు కళాశాల వద్ద వారి వివరాలు నమోదు అందులో 50 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గురించారు వివరించారు. ఈ శిక్షణ కార్యక్ర మంలో వ్యాపారం మొదలు పెట్టడానికి కావలసిన ప్రాథమిక అంశాలు, పరిశ్రమల అనుమతులు బ్యాంకు ల నుంచి పొందగల సహాయం కొరకు సమాచారం అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వ్యాపారా నికి అవసరమైన ముద్ర, పీఎంఈజీపీ లోన్స్ కొరకు యువతకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఔత్సాహిక అభ్యర్థులకు పరిశ్రమల స్థాపన పై అవ గాహన కల్పించి శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాన్ని అందించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాల కొరకు 7780167645 నెంబర్ ను సంప్ర దించాలని కోరారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి సహకరించండి

జూనియర్ సివిల్ జడ్జి కుమారి ఎమ్.రోషిణి

విశాలాంధ్ర - టెక్కలి : లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజి అయ్యేలా సహకరించాలని ఫుల్ అడిషనల్ చార్జి జూనియర్ సివిల్ జడ్జి ఎమ్.రోషిణి అన్నారు. వచ్చే నెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కోర్టు ఆవరణంలో న్యాయవాదులు మరియు పోలీస్ వారితో సమావేశాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్క రించేందుకు న్యాయవాదులు, పోలీసు అధికారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో టెక్కలి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు డివి. వివేకానంద, ఇతర న్యాయవాదులు, టెక్కలి, నందిగాం, మెళి యాపుట్టి, ఎక్సయిజ్ పోలీసు స్టేషన్స్‌కి సంభందించిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.

దేవీ ఆశ్రమంలో పౌర్ణమి పూజలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలం లోని కుంచాలకుర మయ్యపేట దేవీ ఆశ్రమంలో బుధ వారం మాఘ పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో రాజ రాజేశ్వరి దేవీ అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి విశేష హజలు జరిపారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులచే శ్రీ చక్రాల వద్ద కుంకుమ పూజలు జరిపించారు.

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వ్యాపారాలు చేయాలి

ఏ.పి.ఎస్.ఎస్.డి.సి ట్రైనర్ ఢిల్లేశ్వరరావు

విశాలాంధ్ర - నరసన్నపేట : నేటి పోటీ ప్రపంచంలో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వ్యాపారాలను ఔత్సాహిక వ్యాపారులు చేయాలని ఏ.వి.ఎస్.ఎస్.డి.సి ట్రైనర్, ఢిల్లీశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక డి.ఆర్.ఎన్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వ ర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్, ఢిల్లీశ్వరరావు మాట్లాడుతూ మార్కెట్‌లో వ్యాపారాల గురించి ప్రొజెక్ట్ రిపోర్ట్ తయారీ, మార్కెట్‌లో మెలకువలు, నిర్వహణ శక్తి, సామర్థ్యం గురించి, ఖాతా పుస్తకాల నిర్వహణ, వ్యాపారంలో పాటించవలసిన నియమ, నిబంధనలు గురించి, ఉత్పత్తి సామర్థ్యం, సేల్స్, మార్కెటింగ్‌పై పూర్తి సమాచారాన్ని తెలియచేశారు. అనంతరం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, యు.సాయికుమార్ మాట్లాడుతూ పరిశ్రమల అనుమతులకు సంబంధించి, బ్యాంకింగ్ రంగంకు సంబంధించి, ముద్ర రుణాలుకు సంబంధించి విధ్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సుమారు 50మంది యువత పాల్గొనటం జరిగిందని, వీరిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారుచేయటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, గోవిందరావు, ఎపిఎస్ఎస్‌డిసి కో-ఆర్డినేటర్, వేణుగోపాలరావు, కళాశాల అధ్యాపకులు, అప్పలనాయుడు జగన్ పాల్గొన్నారు

ఉపాధి కోసమే ఉపాది హామి పథకం... గ్రామాల్లో విమర్శలు

విశాలాంధ్ర - జలుమూరు : దేశవ్యాప్తంగా 2004లో ప్రారంభమైన గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యక్రమం ద్వారా చెరువులో అభివృద్ధి మాట దేవుడెరుగు గానీ గ్రామస్థాయిలో ప్రజలకు ఉపాధి కలుగుతుందని పలువురు అభిప్రాయ వ్యక్త పరిచారు. రెండు దశాబ్దాల కాలంగా ప్రతి గ్రామంలో ప్రతి ఏటా వంద రోజులు ఉపాధి కల్పించే ఈ పథకం ఒక్కొక్క గ్రామంలో వందలాది మది కూలీలతో పనులు జరుగుతున్నాయి. వంద రోజులకు కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది ఎక్కడ చూసినా ఏ గ్రామంలో చూసిన పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కూలీల వలన ఇతర పనులకు కూలీలు దొరకడం లేదని గిరాకీ పెరిగి పోయిందని విమర్శలు వస్తున్నాయి. ఉపాధి పథకం ద్వారా పనిచేసే కూలీలు బాధ్యతగా భక్తిశ్రద్ధలతో పనులు చేయడం లేదని విమర్శలు మరోపక్క వినిపిస్తున్నాయి. చాలామంది చెరువులో కూర్చోవడం సమయం దొరికినప్పుడు మాట్లాడుకోవడం ఇలా కాలం గడిపేస్తున్నారు తప్ప 20 సంవత్సరాల నుండి చేస్తున్న చెరువులు చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కనిపిస్తున్నాయని పల్లెల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఖర్చు చేస్తున్న నిధులకు కొంతమేరకైనా అభివృద్ధి కనిపిస్తే బాగుంటుందని మేధావుల అభిప్రాయ వ్యక్తపరిచారు.

సంస్థల పటిష్టతలో సబ్ కమిటీల పనితీరే కీలకం : ఏపీఎం కూర్మారావు

విశాలాంధ్ర - మందస : మండల సమాఖ్యలు, గ్రామ సంఘాలు సమర్థవంతంగా నడిచేందుకు సబ్ కమిటీల పనితీరే కీలకమని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం స్థానిక మండల సమాఖ్యలో సవర కాంతమ్మ ఆధ్వర్యంలో నిర్వ హించిన మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు మరియు క్లస్టర్ కోఆర్డినేటర్ల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంస్థల బలోపేతానికి సమర్థవంతమైన నాయకత్వం ఉండి ,మంచి పాలన అందించాలన్నారు. ఏడు రకాల సబ్ కమిటీలు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ వారి యొక్క హ్యుమన్ రిసోర్సును సక్రమంగా వినియోగించుకోవడంపై అవగాహన కల్పించారు. సిబ్బంది నియామకం తో పాటు, వారి పనితీరును సమీక్షించి, గౌరవ వేతనాన్ని ఇచ్చే అధికారం కమ్యూనిటీ సభ్యులకే ఉన్నందున, సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవలసిన బాధ్యత పూర్తిగా సంస్థలకే ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అకౌంటెంట్ కళ్యాణి తో పాటు ఎం.ఎం.ఎస్. సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమాజ సేవకు గుర్తింపు.. నర్మదకు ఉత్తమ జాతీయ అవార్డు

విశాలాంధ్ర - మందస : మహిళా మార్గదర్శి స్వచ్ఛంద సంస్థలో మందస మండల ఫీల్డ్ కోఆర్డినేటర్ గా పనిచేస్తున్న తలగాన నర్మదకు సావిత్రిబాయి పూలే స్మారకార్థం విశాఖపట్నం కు చెందిన డాక్టర్ చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ మరియు చారిటబుల్ సేవా ట్రస్టు ఉత్తమ జాతీయ అవార్డును అందజేశారు. ఈమె మహిళా మార్గదర్శి స్వచ్ఛంద సంస్థలో ఏడాది కాలం నుండి పనిచేస్తున్నారు, గతంలో బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థలో రెండేళ్లుగా పనిచేశారు. మందస గ్రామానికి చెందిన నర్మద స్వచ్ఛంద సంస్థలో అంకిత భావంతో పనిచేసి జిల్లా పరిధిలో మంచి గుర్తింపు పొందారు. గ్రామాలలో మహిళలకు బాలికలకు సామాజిక చైతన్యం కల్పించడంలో నర్మద ప్రధాన భూమిక పోషించారు. వృత్తిలో సేవాభావంతో ఉంటూ బాలికలకు మహిళలకు చట్టాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులు బాల్యవివాహాలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ మహిళల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో 600 మందికి అందించిన ఈ అవార్డు తనకు రావడం ఆనందంగా ఉందన్నారు. జాతీయస్థాయి అవార్డు అందజేసిన సంస్థకు తాను పనిచేస్తున్న మహిళా మార్గదర్శి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఏ.శ్రీనివాసరావు, సీ.ఈ.వో నాగలక్ష్మి కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుకు అత్యవసర ఔషధం

విశాలాంధ్ర - కవిటి : గుండెపోటు వచ్చిన రోగులకు అత్యవసరంగా ఇవ్వాల్సిన స్టెమీ ఇంజక్షన్ అందుబాటులో ఉందని కవిటి సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.రాంజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండెపోటుకు గురైన వెంటనే వేల ఖరీదైన ఇంజక్షన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని అవసరమైన వారు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు.గుండెపోటుకు గురైన వారు మొదటి గంటలో 108కు ఫోన్ చేసి దగ్గరలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు.

కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలకు ఐకార్ గుర్తింపు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని ఎస్ఎస్ఆర్ పురం పరిధిలోని ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కిం జరాపు ఎర్రన్నాయుడు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైనస్సు ఐకార్ (ఐసీఏఆర్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్) గురి ంపు లభించిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి, యాజమాన సభ్యుడు బెండి కార్తీక్ తెలిపారు. కళాశాలలో వారు బుధవారం వివరాలను వెల్లడించారు. ఇటీవల ఐకార్ నియమించిన బృందం కళాశాలను సందర్శించి మౌలిక సౌకర్యాలు, విద్యాబోధన, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వ్యవసాయ క్షేత్రాలు, విద్యార్థులు సాగుచేస్తున్న నూతన వంగడాలను పరిశీలించి ఈ గుర్తింపు ఇచ్చిందన్నారు. ఉత్తరాంధ్రలోనే ప్రైవేటు యాజమాన్యంలోని ఏకైక ఈ కళాశాలకు జాతీయ గుర్తిం పుతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉందన్నారు. ఈ కళాశాలను 2016లో ఏర్పాటుచేయగా ఈ కళాశాల నుంచి ఇప్పటి వరకు ఐదు బ్యాచీలు రిలీవ్ అయ్యారన్నారు. ఈ కళాశాల ఏర్పాటు నుంచి చదువుకున్న విద్యార్థులకుఐకార్ గుర్తింపు వర్తిస్తు ందని చెప్పారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరంలో పీజీ కోర్సులు ప్రారంభానికి అవకాశం ఏర్పడిందన్నారు. అంతేకాకుండా ఇక్కడి విద్యార్థులు దేశంలోని ప్రతిష్టాత్మకమైన కళాశాలలు, పరిశోధనా సంస్థల్లో, అలాగే విదేశాల్లో చదివేందుకు అవకాశం ఉం దన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ కె.మోష, ఇన్చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రావణి, అకడమిక్ ఇన్చార్జి డాక్టర్ రాజ్ రుషి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హర్షవర్ధన్, లైబ్రేరియన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హత్యకు గురైన తహసీల్దార్ రమణయ్య భార్య అనూషకు కారుణ్య నియామకం

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన అనూష

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : విశాఖపట్నం లో తహసీల్దార్ గా పనిచేస్తూ రమణయ్య గత ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ హత్యకు గురయ్యారు. ఈ నేపథ్యంలో రమణయ్య కుటుంబాన్ని ఆదుకుం టామని, ఆ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఎన్నికల ముందు ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ హత్యకు గురైన రమణయ్య భార్య అనూషను డిప్యూటీ తహసీల్దార్ గా నియామిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రమణయ్య భార్య అనూషకు కారుణ్య నియామకంలో భాగంగా డిప్యూటీ తహసీల్దార్ గా నియమించేందుకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా కృషి చేశారు. తమను ఆదుకుని, న్యాయం చేసినందుకు మంత్రి అచ్చెన్నాయుడుకు, ప్రభుత్వానికి డిప్యూటీ తహసీల్దార్ అనూష కృతజ్ఞతలు తెలిపారు.

అడ్డపనస ఆంజనేయ స్వామి దర్శించిన ఎమ్మెల్యే బగ్గు రవణమూర్తి

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండలం అడ్డ పనస గ్రామంలో శ్రీ మహాగణపతి సుబ్రహ్మణ్యేశ్వర సహిత పంచముఖ అభయ ఆంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా నరసన్నపేట శాసన సభ్యులు బొగ్గు రమణమూర్తి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆయన పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. ఆయనతోపాటు మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, అధికార పార్టీ రాష్ట్రబీసీ సెల్ కన్వీనర్ ధర్మాన తేజ్ కుమార్, ఆ పార్టీ నేతలు సురవరపు తిరుపతిరావు, బైరి భాస్కరరావు, పట్ట ఉమామహేశ్వరరావు, బోయిన రవి పలువురు నేతలు పాల్గొన్నారు మీరందరికి ఆలయ పురోహితులు తిరుపతిరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఎంత అద్భుతంగా చేపట్టడం అందరికీ ఎమ్మెల్యే రమణమూర్తి అభినందించారు.

కూటమి ప్రభుత్వం కోసం కలిసి పని చేద్దాం

విశాలాంధ్ర - టెక్కలి : కూటమి ప్రభుత్వం కోసం కలిసి పని చేద్దామని బిజెపి మండల అధ్యక్షులు జర్జాన రాంజీ అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బిజెపి మండల అధ్యక్షులుగా నియమితులైన జర్జాన రాంజీ బుధవారం టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావును పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దుస్సాలువతో సత్కరించి, పుష్పగుత్యాన్ని అందజేశారు. అనంతరం బగాది శేషగిరి రావు మాట్లాడుతూ మనందరం ఒకటేనని, కూటమి ప్రభుత్వం కోసం, ప్రభుత్వం బలోపేతం చేయడానికి మనందరం కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ కూటమి ప్రభుత్వం పథకాలు గొప్పతనాన్ని గురించి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు జన్నీ పరమేశ్వరరావు, టెక్కలి నియోజకవర్గ కోబి కన్వీనర్ నడిపూరు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిలు శాసనపూరి శ్రీను, సంపతిరావు రమేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలనకు కమిటీలు

విశాలాంధ్ర - కవిటి : బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో బాల్య వివాహాల నిరోధిక మరియు బాలల సంరక్షణ కమిటీలు ప్రతీ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేయాలని మిషన్ వాత్సల్య జిల్లా బాలల రక్షణ విభాగం నుండి సోషల్ వర్కర్ డి.మధుర మీనాక్షి అన్నారు.ఈ మేరకు బుధవారం కవిటి వెలుగు కార్యాలయంలో ఏపీఎం గోవింద్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సీఎఫ్ లు, మహిళలతో సమావేశం నిర్వహంచారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు దత్తత, అనదికార దత్తత వల్ల జరిగే నష్టాలను,పోస్టర్ కేర్ ఆస్టర్ కేర్ కార్యక్రమాల గుర్చి ప్రభుత్వం అనుమతి లేకుండా బాలబాలికలతో హాస్టల్ నిర్వహించేవారిపై చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. బాల్య వివాహాలు నిషేదం కొరకు ప్రతీ అంగన్వాడీ కేంద్రంలో 11 నుంచి 18 ఏళ్ల వయస్సు బాలికల సంఘాలు తప్పకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వయంశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్స్ సమస్యల సాధనకు గళమెత్తే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకే మద్దతిస్తాం

కాంట్రాక్ట్ లెక్చరర్స్ అధికార ప్రతినిధి రాంప్రసాద్

విశాలాంధ్ర - పొందూరు : ఫిబ్రవరిలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో, కాంట్రాక్టు లెక్చరర్స్ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసే అభ్యర్థులకే కాంట్రాక్ట్ లెక్చరర్స్ సంఘం మద్దతు ఉంటుందని ఆ సంఘం అధికార ప్రతినిధి దుగ్గివలస రాంప్రసాద్ తోకూడిన కాంట్రాక్ట్ లెక్చరర్ బృందం వెల్లడించింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తమకు కలిసిన విలేకరులతో మాట్లాడుతూ పై విధంగా అన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగ వ్యవస్థ కాంట్రాక్ట్ లెక్చరర్లతోనే మొట్టమొదటిగా ప్రారంభమైన విషయాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ సమాజం గుర్తించాలన్నారు. 25 ఏళ్ల తమ సుదీర్ఘ సర్వీసుల ప్రస్థానంలో ఎటువంటి ఉద్యోగ భద్రతకు నోచుకోలేక పోయామన్నారు. ఐదుగురు ముఖ్యమంత్రులు ఉమ్మడి రాష్ట్రం నుండి పనిచేసినప్పటికీ, తమ బ్రతుకులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉన్నదన్నా ఓ అభ్యుదయ మహాకవి పాడిన పాట గుర్తుకొ స్తోందన్నారు. నేతలందరి మారినా మా తలరాత మారలేదంటూ ఆ వేదన వెలబుచ్చుచున్నారు . తమ తర్వాత సర్వీసులో చేరిన వారిని ఇతర శాఖలలో ప్రభుత్వాలు క్రమబద్ధీకరించాయనీ గుర్తుచేశారు. తమ విషయంలో పాలకులు అన్యాయం చేశారన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చట్టం, యాక్ట్ నెంబర్ 30/2023 ప్రకారం , ఇచ్చిన జీవో నెంబర్ 114 అనుసరించి సర్వీసుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తిచేసినప్పటికీ, నియామక ఉత్తర్వుల జారీలో ఎన్నికల కోడ్ అడ్డంకిగా నిలిచిందన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అయిందన్నారు. ఇప్పటికీ క్రమబద్ధీకరణ ఉత్తర్వుల జారీలో, కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో, ఈ విషయంలో ప్రభుత్వంతో ప్రాతినిధ్యం చేసే చిత్తశుద్ధి కలిగిన,అభ్యర్థికే తాము అండగా నిలుస్తామన్నారు. బరిలో ఉన్న అభ్యర్థులు, ఉత్తరాంధ్ర స్థాయిలో, ఒక వేదిక నిర్ణయించి, తమతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, స్పష్టమైన ప్రకటన చేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల బృందం విన్నవించారు. శ్రీకాకుళం జిల్లా పొందూరులో జరిగిన సమావేశంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల మీడియా ప్రతినిధి దుగ్గివలస రాంప్రసాద్ తో పాటు డాక్టర్ అచ్యుతరావు, పొట్నూరు రమేష్,కాలేపు శ్రీనివాసరావు, దాలినాయుడు, శంకర్రావు, గోవిందరావు, లీలాకుమారి, జగన్నాథం, మంజూష, ప్రవీణ, నాగరాజు, కింతలి లావణ్య, వెంకట్రావు, శ్రీనివాసరావు, శిరీష, సరస్వతి, రత్నకుమారి, పాపారావు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి గడ్కరీని కలసిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్

విశాలాంధ్ర - రణస్థలం : కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కారీని, దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి మర్యాద పూర్వకంగా నియోజక వర్గంలో అవసరమైన రహదార్ల నిర్మాణానికి నిధులు కేటాయిం చాలని కోరుతూ బుధవారం న్యూఢిల్లీ లో ఆయన ఛాంబర్ లో కలిసి విజ్ఞప్తి చేసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు. ఎమ్మెల్యేగా గెలిచినందుకు అభినందనలు తెలియజేస్తూ, నా వంతు సహకారం అందిస్తానని, నిత్యం ప్రజల్లో ఉంటూ సర్వీస్ అందించి పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని కేంద్ర మంత్రి గడ్కారీ సూచించారు.

ప్రకృతి వ్యవసాయానికి అందుబాటులో నవధాన్యాలు

విశాలాంధ్ర - పొందూరు: ప్రకృతివ్యవసాయం చేయదలచుకున్న రైతులకు నవధాన్యాలు అందుబాటులో ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్చార్జి బి.హైమవతి తెలిపారు. మండలం తండ్యాం గ్రామంలో బుదవారం ప్రకృతివ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో వినియోగ దారులకు ఆరోగ్యకర మైన వ్యవసాయ ఉత్పత్తులు అందు బాటులో ఉంచవచ్చు న్నారు. గ్రామంలో రైతులు నవదాన్యాల సాగుకోసం గ్రామంలోనే 50 సెంట్లలో సీడ్లెట్స్ వేయడం జరిగిందన్నారు.

గుండెనొప్పి బాధితులకు అందుబాటులో ఔషదం

విశాలాంధ్ర-సోంపేట: గుండెనొప్పితో బాధ పడుతూ అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు అవసరమైన ఔషదం సోంపేట సామాజిక ఆసుపత్రిలో అందుబాటులో ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో గుండెనొప్పి వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని కోరారు. వచ్చిన వెంటనే ఈసీజీ తీయడంతో పాటు హార్ట్ ఎటాక్ అనే నిర్ధారణ అయినచో సుమారు 50వేల రూపాయల విలువైన టెనెక్టిప్లస్ ఇంజక్షన్ అందుబాటులో ఉందని అన్నారు. తర్వాత అంబులెన్స్ సహాయంతో పెద్దాసుపత్రులకు రిఫర్ చేయడం జరుగుతుందని తెలిపారు. బాధితులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.

కొబ్బరి బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు శైలజ

విశాలాంధ్ర-సోంపేట: ప్రభుత్వం కొబ్బరి పంటకు కల్పించిన బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ సహాయ సంచాలకులు శైలజ పేర్కొన్నారు. సోంపేట ఉద్యానశాఖ అధికారి మాధవిలతతో కలిసి బుధవారం సోంపేట మండలంలోని మామిడిపల్లి, సిరిమామిడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు సమావేశాల్లో మాట్లాడారు. రైతులు తమ తోటలో ఉన్న 4 నుంచి 15 సంవత్సరాలు, అలాగే 16 నుంచి 60 సంవత్సరాలు వయస్సులు గల కొబ్బరిచెట్లుకు ఇన్సురెన్స్ చేయించుకోవాలని కోరారు. ఏడాది, రెండేళ్లు, మూడేళ్ల వ్యవధికి బీమా సౌకర్యం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఒక్కొక్క చెట్టుకు రైతుల నుంచి ప్రీమియం చెల్లించాలని కోరారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అలాగే రైతులకు ఆయిల్ ఫాం పథకం, దాని ప్రాముఖ్యత, బిందుసేద్యం, తుంపర్ల సేద్యం, రిజిస్ట్రేషన్ గూర్చి ఉద్యానశాఖ ప్రస్తుత పథకాలు గూర్చి చర్చించారు. బుషాభద్ర గ్రామంలో కూరగాయల రైతులను అభినందించారు. వీఏఏ భార్గవి, ఉద్యాన సహాయకులు సుధారాణి, ఆయిల్ ఫాం కంపెనీ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

నివగాం రోడ్డులో టీ స్టాల్ దగ్ధం

విశాలాంధ్ర - కొత్తూరు: కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి నివగాం రోడ్‌లోఉన్న ఓ టీ స్టాల్‌లో బుధవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు నాలుగు లక్షల రూ.లు ఆస్తి నష్టం జరిగినట్లు టీస్టాల్ యాజమాని చల్ల సన్యాసిరావు తెలిపారు. కాగా అగ్నిప్రమాద సమాచారం తెలిసిన వెంటనే స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది తమ వాహనంతో వచ్చి మంటలను అదుపులోకి తెచ్చేరు. కాగా ఈ టీ స్టాల్ ఒక షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉండడంతో ఉవెత్తున ఎగిసిన మంటలను చూసి భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు.:

అవధాని తిరుపతిని అభినందించిన మాజీ మంత్రి

విశాలాంధ్ర-సోంపేట: ఒకేపేజీలో రెండు విధాలుగా అందరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో రూపొందించిన 2025 కేలండర్‌ను పరిశీలించిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కేలండర్ రూపకర్త గణిత అవధాని మద్దు తిరుపతిరావును అభినందించారు. బుధవారం కంచిలి మండలం చొట్రాయిపురం గ్రామంలో ఎంపీపీ పైల దేవదాసురెడ్డితో కలిసి గ్రామానికి వ్యక్తిగత పనిపై విచ్చేసిన అప్పలరాజు పాఠశాలలో అవధానిని కలిసి ముచ్చటించారు. కార్యక్రమంలో గుమ్మడి రాందాసు, బదకల మోహనరావు, నర్తు ప్రేమ్, కొర్రాయి శివాజీ, కొనవల సురేష్ పాల్గొన్నారు.

కుల సంఘంకు రూ.50 వేల వంట సామగ్రి వితరణ

విశాలాంధ్ర-పలాస: కళాకారుడుగా, సంఘ సంస్కర్తగా, అండమాన్ శ్రీ శ్రీ శ్రీ జగదీశ్వర సంఘం సభ్యుడుగా అనేక సేవ కార్యక్రమంలలో సేవలు అందించిన గేదెల చిన్నారావు మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం భార్య భానుమతి మరియు కుటుంబ సభ్యులు బుధవారం బొడ్డపాడు అగ్నికులక్షత్రియ సంఘంనకు 50 వేల రూపాయలు విలువ గల వంట పాత్రలు బహుకరించారు. ఈ సందర్భంగా గేదెల చిన్నారావు సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కుల నాయుడు పోతనపల్లి లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు దుష్యంత్ , కోశాధికారి బుడత ధనరాజ్, బొడ్డు మహాలక్ష్మి, బొడ్డు మోహన్ రావు (నాయుడు), బొడ్డు సింహాద్రి, తామాడ రామారావు, బత్తిని వాసుదేవ్,గుజ్జు దశరథరావు, బైనపల్లి లోకనాథం, బొడ్డు జగన్, బైనపల్లి భీమారావు,కుత్తుమ్ హేమలయ్య, తామాడ గంగయ్య, బుడత కాంతారావు, పోతనపల్లి మాధవరావు,పోతనపల్లి మన్మధరావు, గర్తం కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

డా.జీవీకు సంఘీభావం తెలిపిన సీధిరి

విశాలాంధ్ర-పలాస: పలాస ఇందిరాచౌక్ వద్ద గత 40 ఏళ్ళు క్రితం దివంగత మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ విగ్రహం పున:ప్రతిష్ట విషయంలో స్దానికంగా ఏర్పడిన ప్రతిష్టంబన, తదితర పరిణామాల పట్ల డాక్టర్ జీవితేశ్వరరావుకు మాజీ మంత్రి డాక్టర్ సీధిరి అప్పలరాజు సంఘీభావం తెలిపారు. సందర్భంగా డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరా గాంధీ విగ్రహం ఏర్పాటు పై కొన్ని అవాంతాలు ఏర్పడటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహం ఏర్పాటు అయ్యేవరకు తమ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. వైసీపీ కార్యకర్తలతో వెళ్లి బాసటగా ఉంటామని హామి ఇస్తూ సంఘీభావం తెలిపారు.

వైసిపి మండల అధ్యక్షులుగా దువ్వాడ

విశాలాంధ్ర-పలాస: కాశీబుగ్గ ప్రగతి భవన్ లో బుధవారం మాజీ మంత్రి డాక్టర్ సీధిరి అప్పలరాజు అధ్యక్షతన జరిగిన పలాస మండల వైసిపి కార్యకర్తల సమావేశంలో అధ్యక్షులుగా అల్లుకోల గ్రామానికి చెందిన సర్దంచ్ ప్రతినిధి దువ్వాడ రవి కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దువ్వాడ రవి కుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అధ్యక్ష పదవికి ఎంపిక చేసిన మాజీ మంత్రి డాక్టర్ సీధిరి అప్పలరాజుకు, మండల వైకాపా నాయకులు, కార్యకర్తలకు అభినందలు తెలుపుతూ పార్టీ అభివృద్ధికి నిరంతం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పైల వెంకటరావు(చిట్టి), జిల్లా కార్యదర్శి బత్తిన హేమేశ్వరరావు, పలాస ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయిక్రిష్ణ, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, పలాస మండల సర్దంచ్ల సంఘం అధ్యక్షులు కొర్ల సంతోష్, ఉద్దానం పంచాయితీ అధ్యక్షులు సైన దేశయ్య, బొడ్డు సుధాకర్, రాపాక చిన్నారావు, సర్దంచ్లు, ఎంపిటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నివాస గృహాలను కూల్చివేయటం తగదు

బాధితులకు ఆర్థిక సాయం అందించిన "చింతాడ"

విశాలాంధ్ర - ఆముదాలవలస: రాజకీయ విభేదాల కారణంగా నివాస గృహాలను కోర్టు ద్వారా నోటీసులు ఇచ్చి కూల్చివేయటం తగదని వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. మండలంలోని నెల్లిపర్తి గ్రామంలో గత కొంతకాలంగా రాజకీయ విభేదాలు తో సాకేటి ఆదిలక్ష్మి, దేబారిక జ్యోతి నివాస గృహాలను తొలగించాలని కొంతమంది రాజకీయంగా పావులు కలిపి వారి నివాసాలు అక్రమమని వాటిని తొలగిం చాలని హైకోర్టు ద్వారా నోటీసులు అందించి ఆ ఇల్లు ను పడగొట్టారు. దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డా యి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నివాస గృహాలను కూలగొట్టే సంస్కృతి దోహదపడు తుందని విమర్శించారు. ఏ రకమైన ఇబ్బందులు ఉంటే మరో రకంగా సాధించుకోవాలి కానీ పేదల కడు పుపై కొట్టే విధంగా రాజకీయాలు చేయరాదన్నారు. బాధితులకు కొంత నగదును అందించారు తాత్కాలి కంగా ఇల్లును నిర్మించుకొని ఉండాలన్నారు. ఇటు వంటి దురాగతాలకు కూటమి నాయకులు సహ కరించటం సరికాదని హితువు పలికారు. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకూడదని అన్నారు. వాస్తవ పరిస్థితులను బాధిత కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

స్థానిక రైల్వే స్టేషన్ అభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్థానిక రైలు నిలయాన్ని అన్ని విధాల అభివృద్ధి పర్చడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంక్వాల్ అన్నారు. సోమవారం స్థానిక రైలు నిలయాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. డి.ఆర్.ఎం భజానా, ఛీఫ్ హెల్త్ అఫీసర్ రవికుమార్‌లతో కలిసి వచ్చిన జి.ఎం.కు స్టేషన్ మేనేజర్ హెచ్.కె. సాహు సిబ్బందితో కలిసి స్వాగతించారు. స్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనుల్లో నాణ్యతకు రాజీ పడవద్దని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. ఎప్పటికప్పుడు పనులు జరుపుతున్న తీరును పర్యవేక్షించి నివేదికలు అందివ్వాలని స్టేషన్ మేనేజర్‌ను కోరారు. ఈ సందర్భంగా జెడ్.ఆర్.సి.సి శ్రీనివాస్ రౌళొ అధికారులను కలిసి పలు సమస్యలను వివరించారు. స్థానిక మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి పాతాళేశ్వర ఆలయానికి వెళ్ళే మార్గంలో అండర్ పాసేజ్, ప్రధాన రైళ్ళ నిలుపుదల, నార్త్ క్యేబిన్ దగ్గర అండర్ పాసేజ్‌ల కోసం విన్నవించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాళ్ళ ధర్మారావు, బి.జె.పి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బుద్దాల నిర్మల, జి.సాయికామేష్‌లు రైలు నిలయంలో పలు సమస్యలు తెలిపి ఎస్కలేటర్ సదుపాయం కల్పించాలని కోరారు. అనంతరం జి.ఎం రైల్వే క్వార్టర్స్ పరిశీలించి, రైల్వే పార్క్‌ను ప్రారంభించారు.

పంటనమోదు వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్

విశాలాంధ్ర- పొందూరు : రబీసాగులో వ్యవసాయసిబ్బంది పంటనమోదు వివరాలను సక్రమంగా నమోదుచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ అన్నారు. మండలం తోలాపి కనిమెట్ట గ్రామాలలో సూపర్చేక్లో భాగంగా పలు పం టలను తనికీ చేసారు. మండల వ్యవసాయాధికారులు, సచివాలయ వ్యవసాయ సిబ్బంది. వ్యవసాయభూములలోకి వెళ్ళి వివరాలు సేకరించాలన్నారు. రైతులకు ప్రభుత్వం అం దిస్తున్న పథకాలు అందాలంటే పంటనమోదు వివరాలు సక్రమంగా ఉండాలన్నారు. వ్యవసాయ భూములలో రబీ పంటలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. జేసీతో పాటు జిల్లా వ్యవసాయాధికారి త్రినాధస్వామి, ఏడీ శ్రీనివాసరావు. మండల వ్యవసాయాధికారి బి. బాబ్జి తోలాపి, కనిమెట్ట రైతులు పాల్గొన్నారు.

పలాస కాశీబుగ్గ ప్రెస్ క్లబ్ కన్వీనర్‌గా నాని

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ ప్రెస్ క్లబ్(ప్రింట్ మీడియా) కన్వీనర్ గా దేవ విశ్వేశ్వరరావు(నాని)ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ప్రెస్ క్లబ్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత ఏపీయూడబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యులు డి. మహరణ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మీడియా రంగం కలుషితమైపోయిందని దీనిని ప్రక్షాళన చేసేందుకు ప్రతి జర్నలిస్టు ముందుకు రావాలని కోరారు. కొంతమంది జర్నలిస్టుల ముసుగులో చందాలు దండుకోవడంతో పాటు దందాలు చేస్తున్నారని ప్రచారంలో సాగుతుందని, దీని వలన కొంత మంది జర్నలిస్టులకు మచ్చగా తయారయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని నిర్మూలించేందుకే జర్నలిస్టులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. గతంలో ఉన్న ప్రెస్ క్లబ్ కార్యవర్గంను రద్దు చేస్తూ నూతనంగా సభ్యులందరూ ఏకగ్రీవంగా నానిని కన్వీనర్ గా ఎన్నుకున్నామన్నారు. మరి కొన్నాళ్లకు పూర్తిస్థాయిలో ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు జగదీష్, రమణ,హరినారాయణ,అంది రామకృష్ణ(రాము) భాస్కర్ రావు, వంకల రాజారావు, శివ జ్యోతి, తిరుమల రావు, శ్రీను, సవర చిన్నబాబులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా

విశాలాంధ్ర-పలాస: సూర్య ఘర్ విద్యుత్ ఆధా అవుతుందని డివిజనల్ డవలప్మెంట్ అధికారి ఎన్.రమేష్ నాయుడు అన్నారు.బుధవారం పలాస కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఆద్వర్యంలో పలాస డివిజన్ పరిధిలో ఉన్న పంచాయితీ కార్యదర్శులకు ప్రధానమంత్రి సూర్య ఘర్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ఆధా చేసేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టిందని దీనిని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాయితీలపై సూర్యమర్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రస్తుతం ప్రతీ సచివాలయంలో ఒకటైనా సూర్యఘర్ ఏర్పాటుకు అధికారులు చొరవ చూపాలన్నారు. రెండు కిలోవాటు 60 వేలు, మూడు కిలోవాట్కు 78 వేలు రూపాయలు చెప్పున్న ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఎవరికైనా విద్యుత్ మీటరు పేరు తప్పుఒప్పులు, పేరు మార్పులు, చిరునామా మార్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. వివరాల కోసం స్థానిక సచివాలయ లైన్మేన్కు సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో విద్యుత్శాఖ ఇఇ యఘ్నేశ్వరరావు, ఎంపిడిఓ కె.వసంతరావు, విద్యుత్శాఖ ఎడిఇ ఐక్రిష్ణమూర్తి, పలాస ఎఇ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కెవ ధుమూర్తిని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని కోరారు. మంగళగిరిలోని మండలి కార్యాలయంలో చైర్మన్ను వీసీ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బోధన, పరిశోధన, పరిపాలనా కార్యక్రమాలకు సహాయం అందించాలని కోరినట్టు వీసీ చెప్పారు. వర్సిటీలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు, సంస్కరణలను వివరించామన్నారు. త్వరలో విడుదలకానున్న పీఎం ఉషా ప థకం నిధులు ద్వారా చేపట్టబోయే కార్యక్రమాలను, ప్రణాళికలను ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వివరించినట్టు చెప్పారు.

డీలర్ చిరంజీవిని పరామర్శించిన వైసిపి నాయకులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధి కుద్దిరాంకు చెందిన డీలర్ సాధు చిరంజీవిని పట్టణ వైసీపీ నాయకులు బుధ వారం పరామర్శించారు. ఇటీవల అతను ప్రమాదంలో గాయపడ్డారు. తన పనులు ముగించుకుని వాహనంపై వస్తుండగా నైరు కళాశాల దారిలో కుక్క అడ్డంగా రావడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో తన కాలుకు బలమైన గాయాలు తగిలాయి. ఇది గమనిం చిన స్థానికులు తనని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న వైసిపి మున్సి పల్ మాజీ ఫ్లో లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ ఆధ్వ ర్యంలో చికిత్స అనంతరం తన ఇంటికి తీసుకువచ్చా రు. బుధవారం రమేష్ కుమార్ తో పాటు దుంపల శ్యామల రావు, చిరంజీవి, బిట్టు, పొదుగు శ్రీనివా సరావు, బి రమణ మూర్తి, సంపద రావు రామారావు, కె రామకృష్ణ తదితర పట్టణ వైసీపీ మాజీ కౌన్సిలర్లు, నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించిన సీఐ

విశాలాంధ్ర-జలుమూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగం లో ఈనెల 26 మహాశివరాత్రి పర్వదినం మొదలుకొని మూడు రోజులు జరిగే ఉత్సవాల కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం ఉదయం నరసన్నపేట పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె శ్రీనివాసరావు సందర్శించారు. అనేక ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు క్యూలైన్ ఏర్పాట్లు వాహన నిలుపుదల చేసే ప్రదేశాల్ని సందర్శించారు. ఇక్కడ జరిగే ఈ కార్యక్రమాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల సిబ్బంది మనం సంయుక్తంగా వచ్చేయవలసి ఉందని అన్నారు. ఆలయ ప్రాంగణం ఆరుబయట పరిశీలన కార్యక్రమాలు నిర్వహించారు సబ్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ అశోక్ బాబు ఇతరులు పాల్గొన్నారు.

ఆరు మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట మండలం వాండ్రాయి గ్రామానికి చెందిన చంద్రమౌళి వద్ద నిల్వ ఉన్న ఆరు క్వార్టర్ బాట్లను 1.08 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని ఆయనను అరెస్ట్ చేసినట్లు పాతపట్నం ప్రొబిషన్ ఇన్స్పెక్టర్ కోట కృష్ణారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం మద్యంపై రేడింగ్ చేస్తున్న సందర్భంగా ఆయన ఇంటి వద్ద ఈ మద్యం సీసాలులభించాయని సి ఐ కృష్ణారావు తెలిపారు. ప్రభుత్వానికి సహకరించాలని ఎక్కడ మద్యం అక్రమ అమ్మకాలు జరిగిన 14405 కు సమాచారం అందించాలని సీఐ ప్రజల్ని కోరారు.

ప్రతి మహిళ ఆర్థిక పరిపుష్టి సాధించాలి

విశాలాంధ్ర-కవిటి: డ్వాక్రా సంఘాలలో ఉన్న ప్రతి మహిళ ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఏపిఎం గోవింద్ మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. ఈ మేరకు బుధవారం కవిటి మండల మహిళా సమైక్య భవనంలో ఎస్హెచ్జి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ఎస్హెచ్జిలు ఏ గ్రేడ్లో ఉండేటట్లు చర్యలు చేపట్టాలని, రికవరీ వంద శాతం పూర్తిచేయాలని తెలిపారు. అలాగే ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాలు అందేటట్లు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి మహిళ లక్షాధికారి దిశగా పయనించి ఆర్థిక పరిపుష్టి సాధించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ పూడి సుహాసిని, కంప్యూటర్ ఆపరేటర్ కుసుమ, సీసీలు, సిఎఫ్లు, ఎస్హెచ్జి సభ్యులు పాల్గొన్నారు.

కట్యాచార్యుల పేటలో పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర - ఆమదాలవలస: ఆమదాలవలస మండలం కట్యాచార్యుల పేట గ్రామం లో బుధవారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. గ్రా మంలో ఉన్న మురుగు కాలువల్లో పూడిక తీత పను లు చేసి, బ్లీచింగ్ వేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సర్పంచ్ ఎన్ని రామ చంద్రరావు తెలిపారు. చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త వాహనాలకు అందజేయాలని తెలిపారు. సేక రించిన చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలిస్తున్నట్లు వివరించారు. పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటిస్తే ఆరోగ్యవంతంగా జీవించవచ్చునని సూచిం చారు. మన ఇల్లు మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

బాధిత రైతులకు దక్కని న్యాయం..

విశాలాంధ్ర - మందస: మండలం బేతాళపురం గ్రామానికి రైతులు బైపల్లి పాపమ్మ ,గుంటు మాధవరావు, జీ గీతలకు చెందిన జిరాయితీ జీడి, మామిడి, కొబ్బరి తదితర ఉద్యానవన భూముల మీదుగా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అక్రమంగా వేసిన బీటీ రోడ్డు వలన తమకు రూ. 40 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఆయా భూముల సాగు రైతులు గగ్గోలు పెడుతున్నారు. తమకు జరిగిన నష్టం పై కలెక్టరేట్ లోని మీకోసం (పిజిఆర్ఎస్)లో పిర్యాదు చేసిన స్థానిక అధికారుల నిర్వాకం వలన తమకు న్యాయం జరగలేదని బాధిత రైతులు వాపోతున్నారు.తమ అంగీకారం లేకుండా తమను సంప్రదించకుండా గ్రామ సర్పంచ్, కొంతమంది టిడిపి నాయకులు ప్రోద్భలంతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు తమకు అన్యాయం చేశారని ఆరోపిస్తూ బాధిత రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. తమకు న్యాయం చేయాలని "మీ కోసం" (గ్రీవెన్స్ (పిజిఆర్ఎస్) లో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేసామని విలేకరులకు తెలిపారు.దీనిపై సమగ్రమైన దర్యాప్తు చేయవలసిన ఆర్డీవో బాధిత రైతులు పంచాయతీరాజ్ అధికారులతో బహిరంగ విచారణ చేయకుండా అన్యాయం చేశారని ఆరోపించారు.తమకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా, దౌర్జన్యంగా అధికారులతో కలిసి బీటీ రోడ్డునిర్మాణం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పీజీఆర్ఎస్‌లో గ్రామ తీర్మానం గ్రామ సర్పంచ్, పెద్దలు తీర్మానం చేస్తే రైతుల అనుమతి అవసరం లేదని నిర్ధారించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములైనా సర్పంచులు తీర్మానం చేస్తే ఇళ్లు, రోడ్ల నిర్మాణం చేసేయ వచ్చునా.? ప్రైవేటు ఆస్తి పై సర్పంచ్, ఇతర పెద్దలు, టిడిపి నాయకులు , అధికారుల పెత్తనమేమిటని వారు ప్రశ్నించారు. ప్రైవేటు ఆస్తి లాగేసుకుని ప్రభుత్వ పరంగా పక్కానిర్మాణాలు చేసేటప్పుడు సంబంధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలనే కనీస పరిజ్ఞానం లేదా అని దుయ్యబట్టారు. తమ హక్కుల అనుభవంలో ఉన్న జిరాయతీ భూముల హక్కుదారులను సంప్రదించాల్సిన అవసరం లేదన్న లేదన్నట్లుగా ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా పటిష్టంగా చేపట్టిన పిజిఆర్ఎస్ (మీకోసం) ను మందస మండల అధికారులే పక్కదోవ పట్టించినట్లు తేటతెల్లమైందని అన్నారు. బేతాళపురంలో గుంటు మాధవరావు గుంటు గీత, బైపల్లి పాపమ్మలకు చెందిన భూములలో సర్వే నెంబర్లలో 59-6, 57-2, 58-2 గల జరాయితీ భూములలో మా యొక్క అనుమతి గాని మా యొక్క ప్రమేయం గాని లేకుండా గ్రామ పెద్దలు వారి స్వతహాగా తీర్మానం చేసుకోవడం జరిగిందని, దీనికి అధికారులు సహకరిస్తూ బీటీ రోడ్ నిర్మాణం చేసి తమకు తీరని అన్యాయం చేశారని విచారం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేస్తారని ఆవేదన తో కూడిన విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించినటువంటి పి జి ఆర్ ఎస్ దుర్వినియోగం అవుతుందని ,దీనిపై జిల్లా కలెక్టర్ సమగ్రమైన విచారణ జరిపి మా భూముల పై అన్యాయంగా రోడ్డు నిర్మాణం చేసిన పంచాయతీ రాజ్ అధికారులే నష్ట పరిహారం చెల్లించేలా తగు చర్యలు తీసుకుని భూములు కోల్పోయిన రైతులు కోరుతున్నారు.